
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 12 । నవంబర్ । 2024



సోమశిలలో 68.37 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 68.37 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 5,300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, డెల్టాకు 2,150, ఉత్తరకాలువకు 700, కండలేరు కాలువకు 2,600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.79,160
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.7,207
3 శాతం జీఎస్టీతో	రూ.7,423
సవర (8 గ్రా)	రూ.59,384

గరిష్ఠం/కనిష్ఠం
32.2 /25.2

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతంగా ఉండి, ఉరుములు మెరుపుల వాతావరణం ఉంటుంది. సోమవారం గాలిలో తేమ 61 శాతం ఉంది.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌తో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరు (బృందావనం): అసెంబ్లీ సమావేశాల అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా కలిశారు. శాసనమండలిలో చర్చించాల్సిన విషయాలు, నెల్లూరు సిటీ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలపై జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించారు. పార్టీ పటిష్టతపై వైఎస్ జగన్ పలు సూచనలు చేశారు.

23న జెడ్పీ సమావేశం

నెల్లూరు (పొగతోట): ఈ నెల 23న ఉదయం 10.30 గంటలకు జెడ్పీసర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ జే మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, నెడ్‌క్యాప్, వ్యవసాయం, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్య శాఖ తదితర శాఖలపై సమీక్ష జరుగుతుందని, జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా అధికారులు హాజరు కావాలని కోరారు.

21 వరకు ఇంటర్ పరీక్ష ఫీజుకు గడువు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 21వ తేదీ వరకు పొడిగించినట్లు ఆర్ఐఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 అపరాధ రుసుంతో వచ్చేనెల 5వ తేదీ వరకు గడువు ఉందన్నారు.

చెస్ చాంపియన్లు మిథిలేశ్, సంజన



విజేతలతో అతిథులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి అండర్ 13 ఓపెన్ చెస్ చాంపియన్ షిప్‌లో పి. మిథిలేశ్, బి. సంజన చాంపియన్లుగా నిలిచారు. సోమవారం నగరంలోని రాయ్ చెస్ అకాడమీలో నిర్వహించిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో వి.సుశ్వంత్, బాలికల విభాగంలో బి.కీర్తన ద్వితీయ స్థానం సాధించారు. ఈ నెల 19వ తేదీ నుంచి తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు. విజేతలకు కళాలయ సంస్థ డైరెక్టర్ గూడూరు లక్ష్మీ, లతీఫ్‌రెడ్డి, మస్తాన్‌బాబు, ఆనం పద్మనాభరెడ్డి, లావణ్య బహుమతులు అందజేశారు. ఆర్బిటర్ నవీన్, షబ్బీర్, పరిశీలకుడు అజీజ్ పాల్గొన్నారు.

బురిడీ బడ్జెట్ 2024

బాబు మార్కు మోసం

- దగదర్తి విమానాశ్రయానికి చిల్లిగవ్వ లేదు
- రామాయపట్నం పోర్టు పురోగతి మాటేలేదు
- సాగునీటి ప్రాజెక్ట్‌లకు కేటాయింపుల్లో కోత
- ఊసేలేని హైలెవల్ కెనాల్, చిన్న ప్రాజెక్ట్‌ల పురోగతి
- నిరుద్యోగులకు నిరాశే
- తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అరకొరే
- మిగతా సంక్షేమ పథకాలకు మంగళం

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం జరిగింది. నిధుల కేటాయింపులతో బాబు మార్క్ మోసం బయటపడింది. సోమశిల, కండలేరు, తెలుగుగంగకు నిధుల్లో కోతలు పెట్టారు. జిల్లాకే తలమానికంగా నిలిచే దగదర్తి ఎయిర్‌పోర్టుకు చిల్లిగవ్వ కూడా విదల్చలేదు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొరగానే కేటాయించగా, మత్స్యకార భరోసా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఇచ్చే చేయూత, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, నిరుద్యోగ భృతి వంటి సంక్షేమ పథకాలకు ఊసేలేదు. రూ.వేల కోట్లతో రూపుదిద్దుకుంటున్న రామాయపట్నంకు, రాష్ట్ర ఖజానాకు వందల రూ.కోట్లు సంపద సృష్టిస్తున్న కృష్ణపట్నంకు ముష్టి విదిల్చింది. జిల్లాకే ప్రతిష్టాత్మకమైన విక్రమసింహపురి యూనివర్సిటీ అభివృద్ధికి చిల్లర ఇచ్చింది.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సూపర్ సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామని, సామాన్యుల భవిష్యత్‌ను ఉజ్వలం చేస్తామంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అందరి ఆశలను కూకటివేళ్లతో సహా పెకళించేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల తర్వాత తొలిసారిగా ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో నెల్లూరు జిల్లా ప్రజలకు నిరాశే మిగిల్చింది. వ్యవసాయ, సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వక పోగా, పేదల సంక్షేమాన్ని పక్కన పెట్టింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు నెలనెలా ఆర్థిక సాయం వంటి సూపర్ సిక్స్ పథకాలకు నిధుల కేటాయింపు మాటే మరిచిపోయింది. బడ్జెట్ కేటాయింపులపై ఆశలతో ఎదురు చూస్తున్న ప్రజలను బురిడి కొట్టించింది. చంద్రబాబు మార్క్ మోసం మరోసారి బయటపడింది.

ఇరిగేషన్ ప్రాజెక్టులకు శూన్యం

జిల్లాలో ప్రాధాన్యత రంగాల్లో ఒకటైన ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో సోమశిల, తెలుగుగంగ, ఎస్ఎస్ కెనాల్‌కు అరకొరగా కేటాయించగా మిగతా పనులకు మొండి చేయిం చూపింది. ఈ బడ్జెట్‌లో సోమశిల ప్రాజెక్ట్ అనుబంధ పనులకు రూ.193 కోట్లు, తెలుగుగంగ కాలువ ఆధునికీకరణకు రూ.422 కోట్లు, సోమశిల–స్వర్ణముఖి లింకు కెనాల్ పనులకు రూ.66 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారు. ప్రధానంగా మెట్ట ప్రాంత వరప్రదాయిని అయిన ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్‌తో పాటు మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులే జరగలేదు. నగరంలో సర్వేపల్లి కాలువ రిటైనింగ్ వాల్ పనులు, పెన్నాడెల్టా సిస్టంలోని మలిదేవి మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులు నిలిచిపోయాయి. చాబోలు, చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కనుపూరు కెనాల్, ముదివర్తి కాజ్‌వే నిర్మాణాలు పూర్తి కాలేదు. ఆయా ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఊసేలేదు.

పోర్టులు, ఫిషింగ్ హార్బర్ ఊసేలేదు

జిల్లాకే తలమానికమైన రామాయపట్నంపోర్టుకు మొక్కుబడిగా రూ.100 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో కార్యకలాపాల పనులకు సంబంధించి పైనా విదల్చలేదు. దశాబ్దన్నర కాలంగా పెండింగ్‌లో ఉన్న దగదర్తి ఎయిర్‌పోర్టు ఊసే బడ్జెట్‌లో లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వేల కోట్ల ఆదాయాన్ని సమకూర్చుతున్న కృష్ణపట్నం పోర్టుకు అనుబంధంగా చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి రూ.35 కోట్లు విదిల్చింది. జిల్లాకే ప్రతిష్టాత్మకమైన విక్రమ సింహపురి యూనివర్సిటీలో రూ.20 కోట్లు చిల్లర కేటాయించింది. ఇక ప్రధానంగా నగరంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ పనులు నిలిచిపోయాయి. వరద కాలువలు పనులు, వీలిన గ్రామాలతో కలిపి తాగునీటిని అందించేందుకు చేపట్టిన పనులకు నిధులు కేటాయింపులు జరగలేదు.

రామాయపట్నానికి ఉరే..

కూటమి ప్రభుత్వం రామాయపట్నం పోర్టును త్రిశంకు స్వర్గంలోకి నెట్టేసింది. ఈ ప్రాజెక్ట్‌ను కేవలం లైవ్‌లో ఉంచే విధంగా మొక్కుబడిగా కేవలం రూ.100 కోట్లు కేటాయించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లతో ఓడరేవును 16 బెర్త్‌లతో నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. తొలిదశలో బ్యాక్ వాటర్, ఒక బెర్త్ నిర్మాణం పూర్తయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్టర్లను బెదిరించి తరిమేసింది. కమీషన్ల కోసం కొత్త వారికి అవకాశం ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని తెలుస్తోంది.

సంక్షేమానికి మంగళం

గత ప్రభుత్వం కంటే మిన్నగా సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను అందిస్తామని చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లోనే పేద వర్గాలకు మొండిచేయి చూపించింది. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పన సాయం చేస్తానని, ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే ప్రతి బిడ్డకు అమ్మకు వందనం కింద రూ.15 వేలు, అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తానని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు,ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ఆశ చూపి పక్కా మోసం చేశారు. తొలి బడ్జెట్‌లో తప్పక ఆ పథకాలకు కేటాయింపులు చేసి అందిస్తారేమోనని ఆశలు పెట్టుకున్న వారికి నిరాశే మిగిలింది.

అంకెల గారడీ బడ్జెట్



రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. నిధుల కేటాయింపు కాగితాల్లోనే ఉంది. నిధులు ఎలా సాధిస్తారో చెప్పలేదు. సూపర్ సిక్స్ తొలి హామీకు నిధులు కేటాయించలేదు. నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తానని ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ గురించి ప్రస్తావించలేదు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి కీలకమైన పథకాలకు అరకొరగా కేటాయించారు. దీన్ని బట్టి చూస్తే సగం మంది లబ్ధిదారులకు కోత పెట్టే విధంగా కనిపిస్తోంది.

– కే రామిరెడ్డి, ప్రజాప్రతినిధి, పొదలకూరు

పథకాలకు బడ్జెట్‌లో నిధులెక్కడ?



ఎన్నికలకు ముందు అలవికాని హామీలిచ్చిన చంద్రబాబు తీరా బడ్జెట్‌లో అందుకు అవసరమైన నిధులు కేటాయింపు జరపలేదు. సూపర్ సిక్స్ హామీలకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకుండానే మసిపూసి మారేడు చేసినట్లుగా బడ్జెట్ ప్రవేశ పెట్టారు. నిధులే లేకుండా పథకాలెలా అమలు చేస్తారో వారే చెప్పాలి.

– పల్లంరెడ్డి బాలకృష్ణారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు, మనుబోలు

సంక్షేమ ఊసేలేని బడ్జెట్



కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో కేవలం అంకెల గారడి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయాన్ని ఇందులో ప్రస్తావన చేయనేలేదు. హామీలు అమలు దిశగా ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు లేదు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి లేనిపోని అంశాలతో బడ్జెట్ గాడి తప్పింది. యువకులు, మహిళలు, నిరుద్యోగులను ఈ బడ్జెట్ పూర్తిగా నిరాశ పరిచిందనే చెప్పాలి.

– అనంతరాజు వేణుగోపాల్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, ఈపూరు, ముత్తుకూరు

తమ్ముళ్ల మధ్య భూవివాదం

- కోర్టులో ఉన్న ఓ కంపెనీ భూముల వివాదంలో తలదూర్చిన పోలీసులు
- స్థానిక టీడీపీ నేతలకు మద్దతుగా వ్యవహరించిన వైనం
- హక్కుదారులను అదుపులోకి తీసుకుని, కర్రను తరలింపు
- ఖాకీల అత్యుత్సాహం



జామాయిల్ తోటలో గొడవ పడుతున్న టీడీపీ నేతలకు సర్ది చెబుతున్న సీఐ

ఆత్మకూరు (చేజర్ల): టీడీపీ నేతల మధ్య భూవివాదం సోమవారం ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీసింది. పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. వివరాల్లోకి వెళ్తే.. అజయ్‌ఘోష్ అనే వ్యక్తి 'పినాకిని షీ ఫామ్' అనే పేరుతో చేజర్ల మండలం మడపల్లి ప్రాంతంలో 262 ఎకరాల్లో జామాయిల్ తోటలు సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో స్థానికుడైన సోమా శ్రీనివాసులురెడ్డి ఆ కంపెనీలో డైరెక్టర్‌గా ఉండి 2006–07లో ఆ భూమిని లీజుకు తీసుకున్నాడు. అనంతరం వారి మధ్య విభేదాలు రావడంతో అజయ్‌ఘోష్ కంపెనీ నుంచి శ్రీనివాసులురెడ్డిని బయటకు పంపించేశాడు. అయితే శ్రీనివాసులురెడ్డి దొంగ డాక్యుమెంట్లు సృష్టించి కంపెనీలో తనదే ప్రధాన భాగస్వామ్యమని చెప్పుకుంటున్నాడని అజయ్‌ఘోష్ ఆరోపించాడు. ఈ నేపథ్యంలో జూలైలో అజయ్‌ఘోష్ అనుమతి మేరకు టీడీపీ మండల నేత రావి లక్ష్మీనరసారెడ్డి జామాయిల్ తోటలో చెట్లు కొట్టి బద్వేల్‌కు తరలించాడు. అప్పట్లో సోమా శ్రీనివాసులు రెడ్డికి మద్దతుగా మండలానికి చెందిన మరో టీడీపీ నేత గిరినాయుడు ఫ్యాక్టరీకి వెళ్లి లారీని కర్రతో సహా వెనక్కి రప్పించాడు. ఈ వ్యవహారంపై కోర్టులో కేసు ఉండగా తోటలోకి ఎవరూ దిగరాదని ఆదేశాలు ఉన్నాయి. అయితే సోమవారం సంగం సీఐ వేమారెడ్డితో పాటు పలు స్టేషన్ల నుంచి పోలీసులు, ఎస్సైల సమక్షంలో తోటను నరికేందుకు టీడీపీ నేతలు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న అజయ్‌ఘోష్, రావి లక్ష్మీనరసారెడ్డి తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని కొట్టిన కర్రను తరలించడానికి వీల్లేదంటూ అడ్డు పడ్డారు. దీంతో తోటలో ఇరువర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అడ్డుకున్న పోలీసులతో లక్ష్మీ నరసారెడ్డి వాగ్వాదానికి దిగాడు. ఓ దశలో తోట ఎవరికి దక్కకుండా తగలబెట్టేస్తానని హెచ్చరించాడు. దీంతో పోలీసులు ఇరువర్గాలను తోట నుంచి బయటకు తీసుకువచ్చి, వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే రావి లక్ష్మీ నరసారెడ్డి, అజయ్‌ఘోష్, రావి పెంచలరెడ్డిలను సీఐ వేమారెడి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అప్పటి వరకు కొట్టి ఉన్న కర్రను మూడు లారీల్లో తరలించేశారు.

పోలీసుల అత్యుత్సాహం

ఓ కంపెనీకి చెందిన భూములు వివాద వ్యవహారం కోర్టులో కేసు నడుస్తుండగా స్థానిక టీడీపీ నేతలకు మద్దతుగా సంగం సీఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆ భూమి హక్కుదారులను అదుపులోకి తీసుకుని నిర్బంధించి, పోలీసుల భద్రత కల్పించి జామాయిల్ నరికించి తరలించే వరకు అక్రమార్కులకు అండగా నిలిచారు. టీడీపీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతూ పోలీసులు కోర్టులోని వివాద భూమి విషయంలో తలదూర్చడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

సముద్ర తీరం వారికి తల్లి ఒడి. కడలి ఘోష వారికి అమ్మ లాలిపాట. భీతిల్లే అలల్లో ఊయల్లో ఊగినంతగా అలవోకగా జలరాసిపై అనునిత్యం సాగర మథనం. అగాధ జలనిధిలో సాహస సమరంతో జీవనం సాగించే మత్స్యకారుల దిన చర్య అర్ధరాత్రి నుంచి ఆరంభమవుతుంది. అందరూ జనం మధ్య తిరుగుతూ బతుకు జీవనం సాగిస్తుంటే.. వీరు మాత్రం నిర్మానుష్య కల్లోల కడలిలో మత్స్య వేట సాగిస్తుంటారు. ఇల్లు విడిచి కడలిలోకి వెళ్లి.. తిరిగొచ్చే వరకు అనుక్షణం ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొంటారు. మత్స్యకారులు.. జనజీవన స్రవంతిలో బతుకుతున్నా.. వారి బతుకు లోతుల్లోకి తొంగిచూస్తే కన్నీటి వ్యథలు కనిపిస్తాయి. దశాబ్దాలుగా టీడీపీకి అండగా నిలిచినా.. తమపై ఆ ప్రభుత్వం చిన్నచూపు చూడడాన్ని భరించలేకపోతున్నారు. గత ప్రభుత్వం కంటే మిన్నగా ఆదుకుంటామని ఆశలు రేకెత్తించి కనీసం ఆ ఊసే ఎత్తకపోవడంతో గంగపుత్రులు చరిత్రాత్మక ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

కడలి ఘోషలో కన్నీటి వ్యథ

దుర్భరంగా మత్స్యకారుల జీవితాలు

- చేపల వేట తప్ప మరే వృత్తీ చేతకాని పరిస్థితి
- ప్రకృతి వైపరీత్యాలు, వేట నిషేధంతో భుక్తి దొరకని దైన్యం
- కాలుష్యంతో మత్స్య సంపద ఉత్పత్తికి గడ్డు కాలం
- ఆదుకోని ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధమవుతున్న గంగపుత్రులు



వేట చేసి తెప్పను ఒడ్డుకు తీసుకొస్తున్న మత్స్యకారులు

కావలి: కడలి ఒడిలో చేపల వేటనే జీవనంగా మార్చుకున్న గంగ పుత్రులకు ఆ వేట ఆగితే.. ఆ పూట గడిచేది కడుభారం. గత ప్రభుత్వాల ఆదరణ లేక.. దళారుల దగ్గర అప్పులు తెచ్చుకుని పూట గడుపుకునే వీరు.. వేట సమయంలో ఆ అప్పు తీర్చేకునేందుకు పోరాటం చేయాల్సి వస్తుంది. సాగర గర్భంలో రెక్కలు ముక్కలు చేసుకుని చేపలు వేటాడి తీరానికి చేర్చితే.. దళారులు గద్దల్లా తన్నుకుపోతున్నారు. దశాబ్దాలుగా ఆధునిక జీవనానికి దూరంగా బతికిన కడలిపుత్రులు.. ఇప్పుడిప్పుడు పోటీపడుతున్నారు. వేట తప్ప మరోకటి చేతకాని వీరికి ప్రకృతి విపత్తులు, ప్రభుత్వ విధించే వేట నిషేధంతో బతుకు జీవనం పెను సవాల్‌గా మారింది. మరో వైపు తీరం వెంబడి పారిశ్రామికవాడలతో సముద్ర జలాలు కలుషితమై మత్స్య సంపద మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వేటకు అనుకూలంగా ఉండి మత్స్య సంపద ఎక్కువగా లభిస్తుంది. ఈ ఏడాది అంతా తుఫాన్లు, వాయుగుండాలతో సముద్రం అల్లకల్లోలం గా మారడంతో పూర్తిస్థాయిలో వేట సాగిన పరిస్థితి లేదు. ఎన్నెన్నో ఒడిదొడుకులను అలవోకగా అధిగమించినా.. జీవనయానంలో ఈదలేక కుటుంబాలను పోషించుకోలేక నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు.

జనాభా గణాంకాల్లోనూ తేడాలు

ఉమ్మడి జిల్లాలోని 169 కి.మీ. తీర ప్రాంతం 12 మండలాల్లో ఉన్న మత్స్యకార గ్రామాల సంఖ్య, జనాభాపై నిర్దిష్టమైన గణాంకాలను మత్స్యశాఖ సేకరించలేదు. కేరళలోని కొచ్చిన్‌లో కేంద్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే 'సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' 2005లో జిల్లాలో 76 గ్రామాలు, 47,733 మంది జనాభా ఉన్నట్లు లెక్కలు తేల్చింది. అదే సంస్థ 2010లో 94 గ్రామాలుగా విస్తరించడంతో పాటు 64,289 మంది మత్స్యకారులు ఉన్నారని నివేదిక వెల్లడించింది. ఆ సంస్థ నివేదిక ప్రకారమే ఈ ఐదేళ్ల కాలంలో జిల్లాలో మత్స్యకారుల గ్రామాల సంఖ్య 23.7 శాతం పెరిగింది. ప్రస్తుతం అధికారికంగా జిల్లాలో 118 మత్స్యకార గ్రామాలు ఉండగా, జనాభా కేవలం 40 వేల మందినే కనపరుస్తుండటం గమనార్హం. గ్రామాల్లో జనాభా పెరుగుతున్నప్పటికీ మత్స్యశాఖ గణాంకాలు తేడాగా ఉండడం వెనుక ప్రభుత్వ కుట్ర కనిపిస్తోంది. వాస్తవంగా జిల్లాలో 150 వరకు మత్స్యకార గ్రామాలు ఉండగా, జనాభా సుమారు 4 లక్షలవరకు ఉన్నారు. వీరిలో లక్ష మంది ఇతర ప్రాంతాలకు వలసలు పోగా, 2 లక్షల మంది తీర ప్రాంతాల్లోనే ఉంటున్నారు. వీరిలో 50 వేల మంది చేపల వేటనే ఆధారంగా చేసుకుని తమ కుటుంబాలతో జీవనం గడుపుతున్నారు.

హక్కులు, అవకాశాలకు సంఘటిత ఉద్యమానికి సన్నద్ధం

జనాభా ప్రాతిపదికన విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో హక్కులు, అవకాశాలు దశాబ్దాలుగా దక్కకపోగా దగాకు గురవుతున్న మత్స్యకారులు చరిత్రాత్మక సంఘటిత ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి వెన్నుదన్నుగా నిలిచిన మత్స్యకారుల విషయంలో ఆ పార్టీ ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తుందనే భావిస్తున్నారు. వేట తప్ప వేరే జీవన విధానం తెలియని తమను ఆదుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్స్యకారులకు విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగాలతో పాటు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, తాజాగా జరిగిన ఎన్నికల్లో టీడీపీ మాయా మేనిఫెస్టో ప్రచారాన్ని నమ్మి మోసపోయామనే భావనతో ఉన్నారు. ఇటీవల కావలి తీరంలో మత్స్యకారులు భవిష్యత్ కార్యాచరణపై ఊరూరా ప్రచార సభలు నిర్వహిస్తున్నారు. విద్య, ఉద్యోగంతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా ఇలా అన్ని రంగాల్లో వెనుకబడి సమాజంతో పోటీ పడలేక కడలి ఘోషలో కన్నీటి వ్యథలు అనుభవిస్తున్నామని మత్స్యకార గ్రామాల కాపులు, పెద్దలు సంఘాల నాయకులు వాపోతున్నారు. అందుకే తమ హక్కులు, అవకాశాలను సాధించుకునేందుకు పోరాటానికి సిద్ధం కావాలని నిర్ణయించినట్లు పేర్కొంటున్నారు.

ఇవే డిమాండ్లు



సంఘటిత ఉద్యమానికి మత్స్యకారుల సన్నద్ధం (ఫైల్)

- ➡ మత్స్యకారులను బీసీ–ఏ కేటగిరీ నుంచి ఎస్టీ కేటగిరీలో చేర్చడం.
- ➡ తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ రాష్ట్రాల బోట్లు రాష్ట్ర సరిహద్దు జలాల్లోకి, స్థానికంగా ఫైబర్ బోటుతో వేట చేసుకునే ప్రాంతానికి రానివ్వకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- ➡ 2024 సంవత్సరానికి సంబంధించి చేపల వేట నిషేధ కాలం భృతి రూ.10,000 కాకుండా, రోజుకు రూ.500 చొప్పున 60 రోజులకు రూ.30,000 ఇవ్వాలి.
- ➡ వర్షాకాలం, ప్రకృతి విపత్తులు సంభవించి తుఫాన్లు వచ్చినప్పుడు ప్రభుత్వ యంత్రాంగం మత్స్యకారులను చేపల వేటకు వెళ్లొద్దని సూచిస్తోంది. ఆయా రోజుల్లో రోజుకు రూ.500 చొప్పున ఎన్ని రోజులు వేట ఆగితే అన్ని రోజులు పరిహారం ఇవ్వాలి.
- ➡ కృష్ణపట్నం పోర్టు, చిల్లకూరు, ముత్తుకూరు తోటపల్లిగూడూరు మండలాలలో ఏర్పాటు చేసినటువంటి పవర్ ప్లాంట్స్, కృష్ణపట్నం పోర్ట్ సమీప ప్రాంతంలో తవ్విన మట్టిని మత్స్యకారులు వేట చేసుకునే ప్రాంతంలో కాకుండా దూరంగా తరలించాలి.
- ➡ పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే కెమికల్ నీటిని పైపులైన్ ద్వారా సముద్రంలోకి వదలకుండా, ప్రత్యామ్నాయంగా శుద్ధి చేసుకునే విషయం ఆలోచించాలి.
- ➡ ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ అత్యంత నిరుపేదలైన మత్స్యకారులకు కూడా ఇవ్వాలి.
- ➡ మత్స్యకారులు చేపల వేటకు ఉపయోగపడే పరికరాలు, బోట్లు, వలలు, ఇంజిన్లు 75 శాతం సబ్సిడీతో ప్రభుత్వమే అందించాలి.
- ➡ ప్రస్తుత పరిస్థితుల్లో సముద్రంలో మత్స్య సంపద పూర్తిగా తగ్గిపోవడం వల్ల వేటకు వెళ్లినా చేపలు పడకపోవడంతో కనీసం డీజిల్ ఖర్చులు కూడా రావడం లేదు. డీజిల్ సబ్సిడీ ప్రస్తుతం లీటర్‌కు ఉన్న రూ.9 నుంచి రూ.30కు పెంచాలి.
- ➡ చేపల వేట చేస్తూ ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుడి కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
- ➡ మత్స్యకారులందరూ గజఈతగాళ్లే కాబట్టి 200 మంది మత్స్యకార యువతకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ప్రకృతి విపత్తులు సంభవించి, తుఫాన్లు, వరదలు వచ్చినప్పుడు ఆ వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు మత్స్యకారులకు అవకాశం కల్పించాలి.
- ➡ తీర ప్రాంతంలో ఉన్న రొయ్య పిల్లల హేచరీల్లో ఉత్పత్తి చేసే సీడ్‌లో 18 శాతం అందుబాటులో ఉన్న ఉప్పునీటి కాలువలు, చెరువులు, సముద్రంలో వదిలి మత్స్య సంపదను పెంచే చర్యలు చేపట్టాలి.

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఆదుకోవాలి



మత్స్యకారులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలి. సామాజికంగా, ఆర్థికంగా మత్స్యకారులు మెరుగయ్యేందుకు ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పించాలి. మత్స్య సంపద ఎగుమతుల ద్వారా ప్రభుత్వానికి విదేశీ మారక ద్రవ్యం సమకూర్చుతున్న మత్స్యకారుల సంక్షేమ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి.

– వేణుగోపాల్, మత్స్యకార నాయకుడు

సబ్సిడీలు, ఆర్థిక సహాయం పెంచాలి



మత్స్యకారులకు తక్షణమే డీజిల్‌పై ఇస్తున్న సబ్సిడీని రూ.30కు పెంచాలి. చేపల వేట సామగ్రి అయిన బోట్లు, వలలు సబ్సిడీపై పంపిణీ చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపల వేట చేయని రోజులను పరిగణలోకి తీసుకుని మరుసటి నెలలో ఆర్థిక సహాయం అందించాలి. వేట నిషేధిత భృతి రూ.30 వేలు ఇవ్వాలి.

– కొమారి రాజు, మత్స్యకార నాయకుడు



కావలి మండలంలోని సముద్ర తీరంలో మత్స్యకారుల వలలు, నాటు పడవలు

వృద్ధురాలి హత్య కేసులో మరో నిందితురాలి అరెస్ట్

- 50 గ్రాముల బంగారం స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో సంచలనం రేకెత్తించిన ఎం.రమణి అనే వృద్ధురాలి హత్య కేసులో మూడో నిందితురాలిని నెల్లూరు సంతపేట పోలీసులు ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. ఆమె నుంచి 50 గ్రాముల ముడి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. రాజేంద్రనగర్‌కు చెందిన ఎం.రమణి (65), మురుగేషన్‌లు దంపతులకు నలుగురు సంతానం. రమణి ఈనెల నాలుగో తేదీన అదృశ్యమైంది. కుటుంబసభ్యులు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు, ఎస్సై బాలకృష్ణలు సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. అదేరోజు అర్ధరాత్రి చెన్నై కొరుక్కుపేట పోలీసులు సంతపేట ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసి రాజేంద్రనగర్‌కు చెందిన బాలసుబ్రహ్మణ్యం, అతడి కుమార్తెలు తమ అదుపులో ఉన్నారని, వారు తీసుకొచ్చిన సూట్‌కేసులో వృద్ధురాలి మృతదేహం ఉందని చెప్పారు. ఫొటోను పరిశీలించిన ఇక్కడి ఇన్‌స్పెక్టర్ మృతురాలు రమణిగా నిర్ధారించారు. దీంతో అక్కడి పోలీసులు బాలసుబ్రహ్మణ్యంను విచారించగా బంగారు ఆభరణాల కోసమే తాను, తన భార్య సత్యవతి, కుమార్తెతో కలిసి వృద్ధురాలిని హత్య చేసినట్లు వెల్లడించారు. దీంతో తండ్రి, కుమార్తెను అరెస్ట్ చేశారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసును సంతపేట పోలీస్‌స్టేషన్‌కు బదలాయించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అదృశ్యం కేసును హత్య కేసుగా మార్పు చేసి ఆదివారం రాత్రి మూడో నిందితురాలైన సత్యవతిని అరెస్ట్ చేశారు. ఆమెను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని తెలిపారు.

కూటమి ప్రభుత్వంపై కన్నెర్ర

- ఇష్టారాజ్యంగా మద్యం దుకాణాల ఏర్పాటు
- ప్రజల నుంచి వ్యతిరేకత ఉన్నా లెక్కచేయని వ్యాపారులు
- అభ్యంతరాలను పట్టించుకోని అధికారులు
- కలెక్టరేట్ ఎదుట ముస్లింల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు చూపుతూ ధర్నా చేస్తున్న ముస్లింలు

నెల్లూరు(క్రైమ్): కూటమి ప్రభుత్వం ఆదాయమే లక్ష్యంగా మద్యం పాలసీని తీసుకొచ్చింది. పలువురు వ్యాపారులు నిబంధనలను పట్టించుకోకుండా అధికార పార్టీ అండతో గుడి, బడి, నివాస సముదాయాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చేసేదేమీ లేక కొన్ని ప్రాంతాల్లో ప్రజలు మిన్నకుండిపోగా, మరికొన్నిచోట్ల మాత్రం ఆందోళనలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలో 182 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. కొందరు వ్యాపారులు సున్నిత ప్రాంతాలు, జనావాసాల నడుమ షాపులు ఏర్పాటు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాలని స్థానికులు, మహిళలు, మహిళా సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే వారే లేకుండాపోయారు. స్థానిక అధికారులు తమ గోడు వినడం లేదని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తున్నారు.

- నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో మసీదు ఉంది. ముస్లింలు నిత్యం నమాజ్ చేసుకుంటున్నారు. వక్ఫ్‌బోర్డు ఆధీనంలో మసీదు నిర్వహణ జరుగుతోంది. నిబంధనల మేరకు ఎండోమెంట్, వక్ఫ్‌బోర్డు పరిధిలోకి వచ్చే ప్రార్థనా మందిరాల వద్ద మద్యం షాపులు ఏర్పాటు చేయకూడదు. అయితే సమీపంలో రెండు దుకాణాలను పోటీపడి పెట్టారు. దీనిపై ముస్లింలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వాటిని తొలగించాలని ఎక్సైజ్, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినా నేటికీ అవి కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఇలాకాలోనే ఇలా జరుగుతున్నా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి.
- నగరంలోని పరమేశ్వరినగర్ వద్ద జనావాసాలు, దర్గా, దేవాలయం, పాఠశాలకు సమీపంలో మద్యం షాపును ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజలు, మైనారిటీ నేతలు ఆందోళనకు దిగారు. దుకాణాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేశారు. ముస్లిం మహిళలు ప్లకార్డులు ప్రదర్శించారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ..



ర్యాలీ చేస్తున్న ముస్లింలు

నెల్లూరు రూరల్: ప్రార్థనా స్థలాల వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాలంటూ భారత రాజ్యాంగ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. తొలుత మహిళలతో కలిసి ర్యాలీ చేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఒ.ఆనంద్‌కు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హబీబా, నవీద్, జుబేర్, రఫీ, షకీల్, సిరాజ్, సర్దార్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం

జనావాసాల నడుమ మద్యం దుకాణం ఏర్పాటుతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. దుకాణానికి సమీపంలోనే పలువురు మద్యం తాగుతున్నారు. అటుగా వెళ్లేవారిపట్ల వెకిలిగా వ్యవహరిస్తున్నారు. వెంటనే షాపును తొలగించాలి.

– షరీఫా, పరమేశ్వరినగర్

భద్రతేదీ?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మద్యం మత్తులో మహిళలు, చిన్నారులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. జనావాసాల నడుమ మద్యం దుకాణం ఏర్పాటువల్ల మహిళలకు రక్షణ కొరవడుతోంది.

– షాహీదా, వాకర్స్‌రోడ్డు

చర్యలు తీసుకోలేదు

మా ప్రాంతంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని కొన్నిరోజులుగా ఆందోళన చేస్తున్నాం. స్థానిక ఎక్సైజ్ అధికారులతోపాటు రెవెన్యూ అధికారులకు సైతం వినతిపత్రాలు సమర్పించాం. అయినా చర్యలు తీసుకోలేదు.

– రుమానా, పరమేశ్వరినగర్

అధికారులూ స్పందించండి

మసీదు, గుడి, పాఠశాల, జనావాసాల నడుమ మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడం దారుణం. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా స్పందించి దుకాణాలను తొలగించాలి.

– అఫ్రోజా, వాకర్స్ రోడ్డు

వినతులిచ్చి.. అండగా ఉండాలని కోరి..

- కలెక్టర్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 350 వినతిపత్రాల అందజేత
- ఇసుక సమస్యను పరిష్కరించాలంటూ ధర్నా



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్



కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా

నెల్లూరు రూరల్: నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయ్‌భాస్కర్ వినతులు స్వీకరించారు. మొత్తం 350 మంది విచ్చేసి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డ్వామా పీడీ గంగాభవానీ, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీసీఓ గురప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

రాష్ట్రంలో ఇసుక సరఫరాలో లోపాల కారణంగా భవన నిర్మాణ కార్మికులు కొన్నినెలలుగా పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం నేతలు తెలిపారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పనుల్లేక అనేకమంది కూలీలు అప్పులపాలైనట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో చెప్పిన ఉచిత ఇసుక పాలసీని వెంటనే అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో నేతలు శంకర్‌కిశోర్, ఆంజనేయులు, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలంటూ..

కలిగిరి మండలం రావులకొల్లు ఆశావర్కర్‌గా పందిటి విజయమ్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ఆశావర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని చంద్రబాబు హామీలిచ్చారన్నారు. అయితే నేతలు రాజకీయ వేధింపులకు పాల్పడటం సరికాదన్నారు.

మరికొన్ని..

రెవెన్యూ కోర్టులో ఉన్న పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా కార్యదర్శి ఇర్ల వెంకటరమణయ్య వినతిపత్రం అందజేశారు. రీ సర్వేల్లో లోపాలను సరిదిద్దాలన్నారు. మెట్ట ప్రాంతాల్లో ప్రజలు కిడ్నీ వ్యాధిగ్రస్తులుగా మారుతున్నారని, నివారణలో భాగంగా వెలుగొండ జలాలు తీసుకురావాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. ముత్తుకూరు మండలం సీవీఆర్ మధురానగర్‌లో పది కుటుంబాలను బహిష్కరించారని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని విన్నవించారు. విడవలూరు మండలం వావిళ్ల సచివాలయం పరిధిలో తనకు 20 సెంట్ల స్థలం ఉందని, దీనిని కొందరు వ్యక్తులు ఆక్రమించారని రమణమ్మ అనే మహిళ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. కలిగిరి మండలంలోని ఎరుకలరెడ్డిపాళెంలో మునగాల తులసమ్మ భూమిలో మోటార్‌ను, గట్లను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి కోరారు.

బ్యాంక్ ఖాతాలో నగదు మాయం

ఉదయగిరి: మండలంలోని జి.చెరువుపల్లి పంచాయతీ సంజీవరాజుపల్లి గ్రామానికి చెందిన బి.ఆంజనేయరాజు బ్యాంక్ ఖాతాలో నగదు మాయమైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. ఆంజనేయరాజు సెల్‌ఫోన్‌లోని సిమ్ ఈనెల 4వ తేదీన పనిచేయలేదు. దీంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. కొత్త సిమ్ తీసుకుని ఈనెల 9వ తేదీన ఫోన్‌లో వేశాడు. కెనరా బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.1,62,465, స్టేట్ బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.3,900 డ్రా చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో అతను వెంటనే ఆయా బ్యాంక్‌లకు వెళ్లి విచారించాడు. అధికారులు తమకు తెలియదని చెప్పడంతో పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. సైబర్‌క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్):	112
లేయర్ (లైవ్):	110
బ్రాయిలర్ చికెన్:	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	234
లేయర్ చికెన్:	187



మోసపోయాం.. న్యాయం చేయండి

- ఎస్పీకి బాధితుల వేడుకోలు



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగం ఇప్పిస్తానని, రెట్టింపు నగదు ఇస్తామని మోసం చేశారు. ధాన్యం నగదు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పలువురు బాధితులు ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 98 మంది విచ్చేసి తమ సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వాటిని పరిశీలించిన ఆయన చట్టపరిధిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆయా ప్రాంతాల పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీటీసీ డీఎస్పీ గిరిధర్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ఫిర్యాదుల సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- కోటి అనే వ్యక్తి ద్వారా నెల్లూరుకు చెందిన కార్తీక్‌రెడ్డి, సుధాకర్‌లు పరిచయమయ్యారు. వారు రూ.లక్షకు రూ.2 లక్షలు నగదు ఇస్తామని నమ్మించడంతో రూ.20 లక్షలిచ్చాం. నగదు ఇవ్వకుండా బెదిరిస్తున్నారు. వారి గురించి ఆరా తీయగా ఇప్పటికే పలువురిని ఇదే తరహాలో మోసగించారని తెలిసింది. విచారించి న్యాయం చేయాలని హైదరాబాద్‌కు చెందిన ఊర్మిళ, సునీత, అంజలి ఫిర్యాదు చేశారు.
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని గౌతమి, హేమంత్‌లు నమ్మించారు. రూ.4.50 లక్షల నగదు ఇచ్చాం. జాబ్ ఇప్పించలేదు. నగదు తిరిగిచ్చేయాలని కోరగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వేదాయపాళేనికి చెందిన ముంతాజ్, శశిధర్‌లు ఫిర్యాదు చేశారు.
- ప్రసన్నకుమార్‌రెడ్డి అనే వ్యక్తికి రూ.76 లక్షల విలువ చేసే ధాన్యం విక్రయించాను. దానికి సంబంధించిన నగదు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. ఇటీవల అడిగితే దౌర్జన్యం చేశాడని మనుబోలు మండలానికి చెందిన రైతు సురేష్ వినతిపత్రం ఇచ్చారు.
- నాకు కందుకూరు రూరల్ పరిధిలో పొలం ఉంది. దాన్ని అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళకు కౌలుకు ఇచ్చాను. ఆమె నగదు ఇవ్వకుండా, పొలం తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తోందని తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు ఇచ్చారు.
- కొడుకు, కోడలు ప్రతి చిన్న విషయానికి వేధిస్తున్నారని బాలాజీ నగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు, కొడుకు ఇబ్బంది పెడుతున్నాడని గొలగమూడికి చెందిన ఓ వృద్ధుడు ఎస్పీకి ఫిర్యాదులు చేశారు.
- నా తమ్ముడు లైన్‌మెన్‌గా పనిచేస్తూ మృతిచెందాడు. అతడి మృతిపై అనుమానం ఉంది. సమగ్ర దర్యాప్తు జరిపి కారకులపై చర్యలు తీసుకోవాలని సంతపేటకు చెందిన మహిళ వినతిపత్రం ఇచ్చారు.

చెరువులో పడి బాలుడి మృతి



గురుచరణ్ (ఫైల్)



రోదిస్తున్న తల్లి, కుటుంబసభ్యులు

దుత్తలూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని వెంకటంపేటలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. వెంకటంపేటకు చెందిన పందిళ్ల గురుచరణ్ (17) ఆదివారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్తున్నానంటూ ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెంది పరిసర ప్రాంతాలు గాలించగా గురుచరణ్ కనిపించలేదు. అనుమానం వచ్చి సోమవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి పరిశీలించగా నీటిలో శవమై తేలియాడుతున్నాడు. దీంతో మృతదేహాన్ని వెలికితీసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఆదిలక్ష్మి ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గురుచరణ్ మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

వలేటివారిపాలెం: ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అంకభూపాలపురంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. అంకభూపాలపురం గ్రామానికి చెందిన పి.మాధవరావు – విజయల కుమార్తె భావన (15) మండలంలోని చుండి ఏపీ మోడల్ స్కూల్లో పదో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చింది. కడుపు నొప్పిగా ఉందని తల్లికి చెప్పి ఇంటి పక్కనే ఉన్న మరుగుదొడ్డికి వెళ్లింది. కుమార్తె బయటకు రాకపోవడంతో తల్లి తలుపు తట్టింది. స్పందన లేకపోవడంతో కిటికీలో నుంచి చూడగా భావన చున్నీతో ఇనుప రాడ్‌కు ఉరేసుకుని కనిపించింది. విజయ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగులగొట్టి భావనను కిందకు దించారు. 108లో స్థానిక పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.45
సన్నవి : రూ.35
పండ్లు : రూ.20



కారు ఢీకొని బస్సు డ్రైవర్ దుర్మరణం

కావలి: రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవర్ గుండాబత్తిన లోకేశ్ (31) మృతిచెందిన ఘటన కావలిలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు కథనం మేరకు.. వెంకటాచలం మండలానికి చెందిన లోకేశ్ రెండు సొంత బస్సులతో ట్రావెల్స్ నడుపుతున్నాడు. డ్రైవర్ అందుబాటులో లేనప్పుడు తను వెళ్తుంటాడు. ఈ క్రమంలో అల్లూరు మండలం శంభునివారిపాళెం గ్రామానికి చెందిన పెళ్లివారు ప్రకాశం జిల్లా కొత్తపట్నం గ్రామానికి బస్సును అద్దెకు మాట్లాడుకున్నారు. పెళ్లి ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. కావలి రూరల్ మండలం గౌరవరంలో జాతీయ రహదారి పక్కన బస్సును లోకేశ్ ఆపాడు. డ్రైవర్ సీటు వద్ద ఉన్న వాటర్ బాటిల్ తీసుకున్నాడు. ఇంతలో కారు నెల్లూరు వైపు వెళ్తూ అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సోమవారం వెల్లడించారు.

వివాహిత బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జెడ్పీ కాలనీలో రమణారెడ్డి, అపర్ణ (42) దంపతులు నివాసం ఉంటున్నారు. రమణారెడ్డి కాంట్రాక్టు పనులు, రియల్ ఎస్టేట్ చేస్తున్నాడు. వారికి ఒక కుమారుడున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం అపర్ణ తన ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని నిర్ధారించారు. బాధిత కుటుంబసభ్యులు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.